# అమ్మ కొట్టింది

-ప్రఫుల్ల చంద్ర



**అమ్మ అన్నది కమ్మని మాట. ఆమె ప్రేమలో కల్తీ ఉండదు. సంతానం అందరి మీద అమ్మ సమానంగా ప్రేమ కురిపిస్తుంది అంటారు గాని అదంతా అబద్ధం అయ్యగారూ! అమ్మ ప్రేమలో కూడా తేడాలుంటాయి...**

ఎలక్షన్ చలి జ్వరంతో దేశం ఒణికిపోతోంది. నల్ల లాకర్లలో మగ్గిపోతున్న ధనలక్ష్మికి విముక్తి లభించి దేశం మీద పడింది. ప్రజాసేవ చేసెయ్యాలన్న తహతహతో జనం మీద పడ్డారు అభ్యర్థులు.

నినాదాల జడి వానలో, వాగ్దానాల హోరుగాలిలో నింపాదిగా తన ప్రచారం చేసుకుపోతున్నాడు రామయ్యానాయుడు.

ఒక చిన్న టౌన్, ఐదు గ్రామాలున్న ఆ నియోజకవర్గంలోని రామాపురంలో ఆయన పుట్టి, అక్కడే ఐదో క్లాసు వరకు చదివి హైదరాబాద్‌లో డిగ్రీ పాసై అక్కడే పారిశ్రామికవేత్తగా ఎదిగాడు. కడుపులో చల్ల కదలకుండా ఏసీ గదుల్లో ఆయన కాలక్షేపం చేయవచ్చు. కానీ కన్నతల్లిలాంటి జన్మభూమి పిలుస్తోందంటూ ఆయన ఆ నియోజకవర్గ ఎన్నికల్లో పాల్గొని రెండుసార్లు గెలిచాడు. తన పలుకుబడితో ఐదు గ్రామాల్లోనూ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించడమేకాక డాక్టర్లు మందులతోబాటు స్వంత ఖర్చుతో అంబులెన్స్ అందుబాటులో ఉంచాడు. తను చదువుకున్న ఎలిమెంటరీ స్కూలుని హైస్కూలుగా అభివృద్ధి చేశాడు. వివిధ పద్దుల నుంచి ప్రభుత్వ నిధులు రాబట్టి సద్వినియోగం అయ్యేట్టు చూశాడు. ఆ నియోజకవర్గంలో మంచి రోడ్లు, వెలిగే వీధి దీపాలు, నీళ్ళు వచ్చే కుళాయిలూ ఉన్నాయంటే ఆయన చలువే.

నెలలో మొదటివారం రామాపురంలోనే బసచేసి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కరిస్తూ తలలో నాలుక లాగ ఈ పదేళ్ళూ మెలగి మూడోసారి కూడా పోటీకి దిగాడు.

ఆయనకు పోటీగావున్న కుక్క తోకల కూర్మారావుకి నాయుడి వయస్సులో సగం వయస్సు. అనుభవం పూజ్యం. అతడొక పోకిరి, తాగుబోతు, రౌడీ అని అందరికీ తెలుసు. నిజంగా గెలవాలని కాక ఎవరైనా పదివేలు పడేస్తే పోటీనుంచి విరమించి తాగి తందనాలాడడానికే గోదాలో దిగాడని అందరి అభిప్రాయం. అయితే డబ్బిచ్చి అతడిని పోటీనుంచి విరమింపజేయడానికి నాయుడు ఒప్పుకోలేదు. కూర్మం పోటీలో ఉండక తప్పలేదు.

గతంలో మాదిరిగానే నాయుడు అందర్నీ కలుస్తూ కష్టసుఖాలు విచారిస్తూ అదే ప్రచారంగా సాగిపోతోంటే యాభై వాహనాల ఊరేగింపు, రికార్డింగ్ డాన్స్‌లు, సినీ తారల దర్శనంతో కూర్మం ప్రచారం మార్మోగిపోయింది. లేస్తే మనిషినికాను అన్న చందాన ఎన్నికల కమిషన్ ఎంత హుంకరించినా కూర్మం ధారాళంగానే ఖర్చుపెట్టాడు. సారా ప్యాకెట్‌లు, డబ్బు, చీరలు పంచిపెట్టి రెండు కోట్లు ఖర్చుచేశాడని అంచనా. అతనికంత డబ్బు ఎక్కడ నుంచి వచ్చిందో ఎవరికీ తెలియదు.

రామయ్యానాయుడు రామాపురంలోనే బసచేసి ప్రచారం ముమ్మరం చేశాడు.

ఉదయం తొమ్మిదికే బయలుదేరి కలుస్తూ ఒంటిగంటకల్లా రామాపురం శివారు రామాలయం కోనేరువద్ద కాసేపు విశ్రాంతి, డ్రైవర్ కృష్ణ భోజనం క్యారేజీ తెచ్చాక కాస్త ఎంగిలి పడి, కాసేపు అక్కడే నడుం వాల్చి మళ్ళీ ప్రచారానికి బయలుదేరడం ఆయన కార్యక్రమం.

చిన్నప్పటినుంచి ఆయనకు ఆ ఆలయం, కోనేరు అంటే మక్కువ. ఆయన చదువుకున్న బడి అక్కడకు దగ్గరే. స్కూలు అవగానే గుడికి వచ్చి కొలనులోకి కాళ్ళు జారవిడిచి గట్టున కూర్చుని కలువ పూలు, ఆకులూ, తూనీగల్ని చూస్తూ మైమరిచి పోవడం ఆయనకింకా జ్ఞాపకమే. ఆ రోజుల్లో గుడి చుట్టూ పూరిపాకలుండేవి. ఇప్పుడా ప్రాంతం అంతా పాడుపడింది. గుడి కూడా జీర్ణావస్తలో ఉంది. రాముడు దిక్కులేని దేవుడయాడు. తను గెలిచాక ఆలయాన్ని పునరుద్ధరించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి.

ఆయనలా ఆలోచనల ఊయల ఊగుతూండగా కృష్ణ క్యారేజీ తెచ్చి గుడి అరుగు శుభ్రంచేసి అరటాకు మీద ఆయనకు భోజనం వడ్డించాడు. నువ్వు కూడా యిలా కూర్చుని వడ్డించుకో- అనడం ఆయనకు అలవాటు. ఆయన తిన్నాకే వేరుగా కూర్చుని క్యారేజీలో మిగిలినది వడ్డించుకోవడం కృష్ణ అలవాటు. ఆ రోజు-

నాయుడు భోజనంచేసి ఎదుటి అరుగుమీద టవల్ పరుచుకొని నడుం వాల్చాక తనూ భోజనం చేసి ఆయన ఎదురుగా కూర్చున్నాడు కృష్ణ.

"దిగులుగా కనిపిస్తున్నావ్! ఇంటి మీదకు ధ్యాస మళ్ళిందా? పోనీ, కారు తీసుకుని హైదరాబాద్‌కి వెళ్ళిపో. రేపు ఉదయాన్నే లక్ష్మణ్‌ని పంపు" నాయుడు స్వరంలో వాత్సల్యం.

"అదేం లేదు అయ్యగారూ! నిజం చెప్పాలంటే యింటికెళ్ళాలనిపించడం లేదు." కృష్ణ స్వరంలో బాధ.

అతనిది రోజూ ఉండే సమస్యే. జులాయిగా తిరిగే తమ్ముడు శివ, ఫ్యాషన్‌లు మరిగిన చెల్లి లక్ష్మి. వాళ్ళని దారిలో పెట్టడానికి తను మందలిస్తే వాళ్ళని వెనకేసుకొచ్చే అమ్మ!

"అమ్మ అన్నది కమ్మని మాట. ఆమె ప్రేమలో కల్తీ ఉండదు. సంతానం అందరి మీద అమ్మ సమానంగా ప్రేమ కురిపిస్తుంది అంటారు గాని అదంతా అబద్ధం అయ్యగారూ! అమ్మ ప్రేమలో కూడా తేడాలుంటాయి... కనీసం మా అమ్మ ప్రేమలో! నా జేబులో డబ్బు కాజేసినందుకు నేను తమ్ముడ్ని గట్టిగా

మందలిస్తే వాడిని వెనకేసుకొచ్చి అమ్మ నన్ను కొట్టింది అయ్యగారూ! నన్ను కొట్టింది! ఎప్పుడూ యింతే, వాళ్ళంటే ప్రేమ. నేనంటే లోకువ" కృష్ణ కళ్ళలో కన్నీళ్ళు. గొంతులో జీర.

"అమ్మని నిందించకూడదు కృష్ణా! తప్పుదోవ పట్టిన పిల్లల మీద ఏ తల్లికైనా కాస్త అభిమానం ఎక్కువ. అందుకని అపార్థం చేసుకోకూడదు. ప్రోడిగల్ సన్ కథ తెలుసుకదా." మృదువుగా నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు నాయుడు.

అయ్యగారితో వాదించడం బావుండని మౌనం వహించినా అతనికి తెలుసు- కాగితాల మీద రాసిన కవితలూ, కథల చుట్టూ గిరికీలు కొట్టే ఈ మేధావులకు కట్టెదుట కనిపించే వాస్తవాలు తలకెక్కవని!

మేధావి నాయుడికి వాస్తవ పరిస్థితులు తలకెక్కలేదని మరో విధంగా కూడా నిరూపణ అయింది- వారం రోజులు గడిచాక.

కన్న తల్లిగా భావించిన జన్మభూమి ఆయన చెంప ఛెళ్ళుమనిపించింది! దిగ్భ్రాంతికరంగా, ఊహాతీతంగా ఎన్నికల్లో ఆయన ఓడిపోయాడు! ఆయన పార్టీ ప్రభుత్వం తుడిచిపెట్టుకుపోయింది! ఆయనే కాదు, రామాపురం ప్రజలూ ఆ విషయం నమ్మలేకపోయారు.

తను ప్రజలకోసం ఎంతగా తపించాడు! కోట్లకొద్దీ స్వంత డబ్బు ఈ పదేళ్ళలో వాళ్ళకోసం ఖర్చుపెట్టాడే! ఆ కృతజ్ఞత అయినా లేకుండా ఛీ, పొమ్మన్నారే! అని పొగిలి పొగిలి ఏడ్చుకున్నాడు. ఫలితాలు తెలిశాక-

ప్రజలు పరిణతి చెందారని, ప్రభుత్వాన్ని మార్చేయగలుగుతున్నారని మేధావులు వ్యాసాలు గుప్పించారు. మొదటిసారి మేధావుల డొల్లదనం అనుభవానికొచ్చిందాయనకు. ఉన్న ప్రభుత్వాన్ని కూల్చేసి అస్థిర అధ్వాన ప్రభుత్వాన్ని ఆహ్వానించడం పరిణతా?

ఒక రోజంతా గదిలోనే ఉండిపోయి క్రమక్రమంగా ఓటమిని జీర్ణించుకొని బయటకొచ్చాడు నాయుడు.

అర టిక్కట్లు, పావు టిక్కట్లతోబాటు ఆయన, భార్య, ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, ఇద్దరు కూతుళ్ళు, అల్లుళ్ళతో సుఖశాంతులతో ఉండే ఉమ్మడి కుటుంబం వాళ్ళది.

ఉదయం టిఫిన్, రాత్రి భోజనం అందరూ కలిసే చేస్తారు. మధ్యాహ్న భోజనం మాత్రం ఎవరి బిజీని బట్టి వాళ్ళు, ఎక్కడ వీలైతే అక్కడ. కుటుంబ సమస్యలన్నీ డైనింగ్ టేబుల్ వద్దనే చర్చ.

ఆ రాత్రి భోజనాల వద్ద ఆయన ఓటమి ప్రస్తావనకొచ్చింది.

"మీరీ పదేళ్ళలో ఉమ్మడి ఆస్తి పది కోట్లు ఖర్చు పెట్టేసినా మేము అడ్డుచెప్పలేదు. ఇప్పుడు మీ ప్రజలే మిమ్మల్ని తిరస్కరించారు. కాబట్టి ప్రజాసేవంటూ మీరా గ్రామాలచుట్టూ తిరుగుతూ యింకా, యింకా ఖర్చుపెట్టడం మాకిష్టం లేదు" ఉమ్మడి అభిప్రాయం లాగ చెప్పాడు పెద్ద కొడుకు.

గుండు దెబ్బతిన్న జింకలాగ విలవిలా చూశాడు నాయుడు.

మనం దాతలుగా ఉండాలి గాని అడుక్కో కూడదు. ఓట్లు అడుక్కోవడం వల్లనే ఈనాడు మీకీ దుస్థితి. విశ్వాస ఘాతకుల్ని ఆదుకోవడం, వాళ్ళకోసం ఆరాటపడడం అనవసరం. మనకు దేవుడిచ్చిన దానిలో కొంత అభాగ్యులకోసం ఖర్చుపెట్టడం మాకూ యిష్టమే. సాయంకోరి మీవద్దకొచ్చే వాళ్ళ అర్హతనుబట్టి ఆదుకోండి. కాదనం. సేవా దృక్పథంతోనే మనం హైదరాబాద్‌లో ఆస్పత్రి నడుపుతున్నాం. ఆ వ్యవహారాలు మీరు చూసుకోండి- అని అందరూ నిర్మొహమాటంగా చెప్పేశారు.

తన ఓటమి వల్లనే వాళ్ళ నోళ్ళు లేచాయని బాధపడినా- వాళ్ళు చెప్పిందీ నిజమే అనిపించింది- నాయుడికి.

ఆ రోజు నియోజకవర్గం అంతా తిరిగి ప్రజలకు కృతజ్ఞత చెప్పుకొని హైదరాబాద్‌కి తిరుగుముఖం పట్టే



"అమ్మ కొట్టిందని బాధపడ్డాను. కోపం వచ్చింది. నెల నెలా ఆమెకు వెయ్యి రూపాయిలిచ్చి వేరే ఉండాలని నిర్ణయించుకున్నాను. అమ్మ నిర్ఘాంతపోయింది. బతిమాలింది. నేను పట్టించుకోకుండా వాళ్ళకి దూరంగా ఉంటున్నా"

ముందు రామాలయం కొలను గట్టుమీద నిస్త్రాణగా కూలబడ్డాడాయన. "అమ్మ కొట్టినందుకు బాధగా ఉందా, అయ్యగారూ?" మృదువుగా అడిగాడు కృష్ణ. నిర్వేదంగా చూశాడు నాయుడు.

"నాకు సుద్దులు చెప్పారు. అమ్మ ఎంత పక్షపాతంగా, ఎంత అకారణంగా కొట్టగలదో ఇప్పుడర్థం అయిందా అయ్యగారూ?" కృష్ణ నవ్వాడు. నాయుడు తల వాలిపోయింది.

టాపిక్ మార్చడానికి "మీ యింటి పరిస్థితి యిప్పుడెలా ఉంది?" అడిగాడు.

"అమ్మ కొట్టిందని బాధపడ్డాను. కోపం వచ్చింది. నెల నెలా ఆమెకు వెయ్యి రూపాయిలిచ్చి వేరే ఉండాలని నిర్ణయించుకున్నాను. అమ్మ నిర్ఘాంతపోయింది. బతిమాలింది. నేను పట్టించుకోకుండా వాళ్ళకి దూరంగా ఉంటున్నా" గంభీర మౌనం వహించాడు కృష్ణ- అర్థవంతంగా అయ్యగారి వైపు చూస్తూ.

మీరు కూడా మీ నియోజక వర్గానికి దూరంగా ఉండమన్న సూచన ఉందాచూపులో.

ఇంటికొచ్చేశాక భోజనాల వద్ద పెద్దబ్బాయి కూడా అదే సూచన చేశాడు.

తీసి పారేసిన కరేపాకులాగ కుర్చీకి అంటుకుపోయాడు నాయుడు.

★ ★ ★

ప్రజాప్రతినిధి అయితే రోజంతా బిజీ. కాని యిప్పుడాయనకు బోలెడు తీరిక. ఉదయం ఆస్పత్రికెళ్ళి డాక్టర్లతో సాధక బాధకాలు చర్చించి, రోగులను కలిసి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ప్రయత్నించడం ఆయన కొత్త కార్యక్రమం అయింది.

హృదయ గాయాలు మానడానికి కాలం అద్భుత ఔషధం.

నాయుడు ఓటమి బాధ నుంచి క్రమంగా బయటపడ్డాడు గాని జన్మభూమి బంధాన్ని పూర్తిగా తెంచుకోలేక రామాలయం వరకు వెళ్ళి కొలనుగట్టున కాసేపు కలలు కంటూ కూర్చుని రావడం అలవాటు చేసుకున్నాడు.

కృష్ణ దూరంగా ఉండడంతో తల్లికి పశ్చాత్తాపం లాంటిది కలిగింది. చిన్న కొడుకు పెడసరంబుద్ధులు, కూతురు నిర్లక్ష్యం ఆమెను బాధించాయి. పెద్ద కొడుకు విలువ తెలిసి వచ్చింది. ఇంటికొచ్చేయమని బతిమాలింది. అయితే అతడు లొంగలేదు.

ఆమె బాధ అతనికి విచిత్రమైన ఆనందానిచ్చింది.

నాయుడు రామాలయంవరకూ వచ్చి గ్రామంలోకి రాకుండానే వెళ్ళిపోతున్నాడని తెలిసి గ్రామస్థులు ఆయన వద్దకొచ్చి సమస్యలు చెప్పుకోవడం ప్రారంభించారు.

ఎన్నికల్లో రెండు కోట్లు ఖర్చుపెట్టిన కూర్మం అంతకు మూడు రెట్లు పోగేసుకునే కార్యక్రమంలో పడ్డాడు.

పల్లెల్లో పనిచేయడానికి ఏ ఉద్యోగికీ యిష్టం ఉండదు. నాయుడి బలవంతంవల్ల ఉండవలసి వచ్చిన డాక్టర్లు, మాస్టార్లు, ఇతర ఉద్యోగులూ కూర్మంకి లంచాలిచ్చి బదిలీ చేయించుకొని వెళ్ళిపోయారు. వారి స్థానాల్లో మరెవరూ రాకపోవడంతో ఆరోగ్య కేంద్రాలు పూర్తిగానూ, ఆఫీసులూ స్కూళ్ళూ సగమూ మూతపడ్డాయి. వివిధ ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం అయాయి. నాయుడు స్వంత ఖర్చుతో ఏర్పాటు చేసిన అంబులెన్స్ యిప్పుడు లేకపోవడంతో సకాలంలో వైద్యం అందక ఇద్దరు మరణించారు.

ఆ కష్టాలను వింటూంటే కృష్ణకుమల్లే నాయుడికి కూడా వింత ఆనందం కలిగింది. కార్యరంగంలోకి దూకి వాళ్ళని ఆదుకోవాలనిపించింది కూడా.

కానీ కృష్ణ వారించాడు "మా అమ్మ పశ్చాత్తాపం లాగే వుంది వీళ్ళ వ్యవహారం కూడా కానీ బెట్టు సడలించి నేను యింటికి పోతే అప్పుడే తమ్ముడు, చెల్లినుంచి అసలు సమస్యలు మళ్ళీ ప్రారంభం అవుతాయి. వాళ్ళలో కూడా మార్పు వచ్చేకనే నేను యింటికి వెళ్ళేది. అట్లాగే మీరిప్పుడు బెట్టు సడలించడం మంచిది కాదు. గతంలో మీకు ఓటు వేయని వాళ్ళు కూడా వచ్చి బతిమాలితే అప్పుడు ఆలోచించవచ్చు."

ప్రజాసేవలో కూడా యిన్ని మతలబులా అని ఆశ్చర్యపోయాడు నాయుడు.

నెలలు గడుస్తూనే వున్నాయి. కృష్ణ కుటుంబానికొక పరిష్కారం లభించింది. తమ్ముడు దొంగతనం చేసి పట్టుబడి జైలుకి పోయాడు. చెల్లి పక్కింటి వాడితో ఉడాయించింది. తన పెంపక లోపాన్ని గ్రహించి అమ్మ నిజంగా కుమిలిపోతోంటే ఆమెను తన యింటికి తెచ్చుకున్నాడు కృష్ణ. ఇప్పుడు అమ్మకి కృష్ణ అంటే ఎనలేని గౌరవం. అంతు లేని ప్రేమ!

సంవత్సరాలు గడిచాయి... మళ్ళీ ఎన్నికలు కనుచూపు మేరలోకి వచ్చాయి.

రామాపురం నియోజకవర్గంలో పెనుమార్పులు... ప్రతి గ్రామ శివారులో సారాబట్టీలు, వేశ్యా గృహాలు వెలిశాయి. కూర్మం అనుయాయులు రౌడీ మామూళ్ళు వసూలు చేయడం ప్రారంభించారు. *(మిగతా 12వ పేజీలో)*

*(9వ పేజీ తరువాయి)*

రెండు సగ్గు బియ్యం ఫ్యాక్టరీలు, మూడు యిటుక బట్టీలు లేచాయి. ఫ్యాక్టరీ వ్యర్థాలు ప్రక్క కాలువలోకి వదిలేస్తూ ఉండడంతో ఆ నీరు తాగే ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇదంతా కూర్మం వల్లనే అని గ్రహించిన ప్రజలు ఆగ్రహించి వచ్చే ఎన్నికలలో నిలబడమని నాయుడిని ప్రాధేయపడ్డారు.

నాయుడికీ నిలబడాలని ఉబలాటంగానే ఉంది. కృష్ణ సలహా అడిగాడు.

కృష్ణ కాసేపు ఆలోచించి "పోటీ చేస్తే మీరు గెలవ వచ్చు. కానీ ఓటమిని హుందాగా స్వీకరించే తత్వం కాదు కూర్మంది. నానా యాగీ చేసి మిమ్మల్ని కుదురుగా పనిచేసుకోనివ్వడు. కక్షతో కేసులు పెట్టించ వచ్చు. మీరు కోర్టుల చుట్టూ తిరగాలి. ఈ వయసులో మీకిది అవసరమా?" గంభీరంగా అడిగాడు.

అదీ నిజమే. కాని కొందరైనా మంచివాళ్ళు ఎన్నికైతే రాజకీయాలు బాగుపడవచ్చుకదా అని నాయుడు ఉద్దేశం.

"మిస్టర్ క్లీన్ అనే ఇమేజ్‌తో వచ్చిన ప్రధాని గతి ఏమయిందో చూశాం. మిస్టర్ డీసెంట్‌గా పేరుతెచ్చుకున్న ఇప్పటి ప్రధాని నేర చరితుల్ని వెనకేసుకు రావడం చూస్తున్నాం. రాజకీయాల్లో మంచి వాళ్ళు ఏం చేయగలరు అసలు?" కృష్ణ స్వరంలో ఆవేశం.

ఉండుండి సగ్గు బియ్యం ఫ్యాక్టరీల నుంచి దుర్గంధం గుప్పుమంటోంది. ఇటుక బట్టీలనుంచి వెలువడుతున్న పొగ గాలిలో కలిసి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

రాజకీయాలిలా కుళ్ళిపోవలసిందేనా అని నిస్పృహ ఆవరించింది నాయుడుని.

"అమెరికా, బ్రిటన్, జపాన్ లాంటి దేశాల్లో అవినీతి ఆరోపణలు రాగానే సంబంధితులు వెంటనే రాజీనామా చేస్తారు. మళ్ళీ ఎన్నికలలో నిలబడరు. అందుకు ప్రజల చైతన్యం ఒక కారణం. కానీ అసలైన కారణం- అక్కడ కోర్టుల్లో సత్వర న్యాయం లభించడం, నేరం చేస్తే ప్రధాని కొడుకునైనా అరెస్ట్ చేసే సత్తా పోలీసులకుండడం. మరి మన దేశంలో జరుగుతున్నదేమిటి? కోర్టుల్లో ఏ అవినీతి కేసులోనూ పది పదిహేనేళ్ళ వరకూ తీర్పు రాదు. ఈమధ్య పేపర్లలో చూసి ఉంటారు. డ్యూటీలో వున్న పోలీసుని కొట్టినందుకు ఎనిమిదేళ్ళు కేసు నడిచి చివరకు శిక్ష పడింది. ప్రేయసిని కిడ్నాప్ చేయాలని ప్రయత్నించిన ప్రియుడికి ఇరవై ఏళ్ళ తర్వాత తీర్పు వచ్చింది. నిరూపించబడే వరకూ ఎవరూ నేరస్తులు కారన్న దౌర్భాగ్య సూత్రాన్ని అడ్డంపెట్టుకొని నేరస్తులు దర్జాగా ఎన్నికల్లో గెలుస్తారు. మంత్రులవుతారు. చట్టాన్ని ధిక్కరించి వెక్కిరించే వాళ్ళ చేతిలోనే చట్టంచేసే అధికారమూ ఉంటున్నది. ప్రధాని కొడుకే కానక్కర లేదు, ఎమ్మెల్యే బంధువైనా సరే- నడి రోడ్డుమీద అందరి సమక్షంలో హత్య చేసినా మన పోలీసులు అరెస్ట్ చేయలేరు. మేధావులు ఎంతసేపూ ఎన్నికల సంస్కరణలు అంటారు గాని అమెరికా, బ్రిటన్‌లలో వున్న మాదిరిగా మన చట్టాల్ని, పోలీసు శాఖనీ మార్చే ప్రయత్నం ఎందుకు చేయరు?"

> **"మిస్టర్ క్లీన్ అనే ఇమేజ్‌తో వచ్చిన ప్రధాని గతి ఏమయిందో చూశాం. మిస్టర్ డీసెంట్‌గా పేరుతెచ్చు కున్న ఇప్పటి ప్రధాని నేర చరితుల్ని వెనకేసుకు రావడం చూస్తున్నాం. రాజకీయాల్లో మంచి వాళ్ళు ఏం చేయగలరు అసలు?" రాజకీయాలిలా కుళ్ళిపోవలసిందేనా అని నిస్పృహ ఆవరించింది నాయుడుని.**

ఎక్కువగా వాగుతున్నట్లనిపించింది కాబోలు హఠాత్తుగా మౌనం వహించాడు కృష్ణ.

దిగ్భ్రాంతిగా అతని వైపే చూస్తుండిపోయిన నాయుడు తేరుకొని "కృష్ణా! ఎంతవరకు చదువుకున్నావ్?" అడిగాడు ఆశ్చర్యంగా.

"చదివింది ఇంటరే. కాని ఖాళీ సమయాల్లో పేపర్లు చదువుతాను. ఆలోచిస్తూ ఉంటాను" ఆయన దిగ్భ్రాంతి చూసి బిడియంగా అన్నాడు కృష్ణ.

ఆలోచిస్తూ ఉంటాను... ఆ ఒక్క మాటా నాయుడు గుండెల్లో నాటుకుంది.

రొటీన్‌గా ఆలోచిస్తూ, రొటీన్‌గా పనిచేసుకుపోవడమే గాని ఏ సమస్య గురించీ ఆయన లోతుగా, సరికొత్తగా ఆలోచించింది లేదు. "అయితే నన్నేం చేయమంటావోయ్?" కొత్తగా అంకురించిన గౌరవంతో అడిగాడు.

ఆ గౌరవానికి మరింత సిగ్గుపడిపోయిన కృష్ణ తల వంచుకొని గడ్డి పరకలు తుంపుతూ అన్నాడు "నేనేం చెప్పగలను అయ్యగారూ! మీ పరిస్థితిలో నేనుంటే మాత్రం ఎన్నికల గోదాలోకి దిగను. మేధావులను సమావేశ పరిచి సత్వర న్యాయం లభించేట్టు చట్టాల్ని మార్చే దిశలో కృషి చేస్తాను. రాజకీయ నాయకుల చేతిలోకాక కోర్టులు, న్యాయమూర్తులు మాదిరిగా పోలీసుశాఖ కూడా స్వతంత్రంగా వ్యవహరించే దిశలో ఉద్యమిస్తాను. అప్పుడు రాజకీయాలూ బాగుపడతాయి. దేశమూ బాగుపడుతుంది."

విస్ఫారిత నేత్రాలతో కృష్ణను చూస్తూండి పోయాడు నాయుడు.

ఆయన కళ్ళకు డ్రైవర్ కృష్ణ కనిపించడం లేదు. భగవద్గీత బోధిస్తున్న విజయ రథ సారధి శ్రీకృష్ణుడు కనిపిస్తున్నాడు!

★

# ఇది మీకు తెలుసా?



*ముంతాజ్ స్మృతి చిహ్నంగా షాజహాన్ తాజ్‌మహల్‌ను నిర్మించిన విషయం అందరికీ తెలిసిందే. కానీ -ముంతాజ్ ఎందుకు ఎలా చనిపోయిందో చాలామందికి తెలియదు. 14వ కాన్పు శిశు జననం సమయంలో ఆమె చనిపోయిందట.*

*★ మంచులో కూరుకుపోయిన మృతదేహం చెక్కుచెదరకుండా ఉండటాన్ని చూశాకే... రెఫ్రిజిరేటర్‌ను రూపొందించాలన్న ఆలోచన ఆస్ట్రేలియా శాస్త్రవేత్త 'థామస్ చూప్‌క్లిప్ మొర్ట్' కు కలిగింది.*

*★ బాగా వత్తుగా జుట్టు ఉన్న వారి తలమీద మీరు ఊహిస్తున్నట్టుగా కోటానుకోట్ల వెంట్రుకలు ఉండవు. మహా ఉంటే లక్షనుండి లక్షాయాభైవేల వరకూ ఉంటాయి.*

*★ ప్రపంచ జాతీయ జెండాలలో పెరుగ్వే జాతీయ జెండాకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ జెండా అన్ని జెండాల మాదిరిగా రెండువైపుల ఒకే రకంగా ఉండదు.*

*★ పెనుగాలి వేగం... గంటకు 100 కి.మీకు పైగా ఉంటుంది. మరి చిరుగాలి వేగం ఎంతో ఊహించగలరా? గంటకు 20 కి.మీ.*

*★ ద్వితీయ ప్రపంచ సంగ్రామం 1944వ సంవత్సరం... 11వ నెల, 11వ రోజు 11 గంటలకు ముగిసిందన్న నిజం మీకు తెలుసా?*

*★ క్యాట్‌ఫిష్ అనే రకం చేపలు గుడ్లను నోట్లో ఉంచుకుని పొదుగుతాయి.*



*★ వాటర్‌లూ యుద్ధంలో పరాజితుడై సెయింట్ హెలెనా దీవిలో బంధితుడయిన నెపోలియన్... జైలులో పొద్దుపోవడానికి ఏమి చేసేవాడో తెలుసా? తానొక్కడే కూర్చొని పేకాట ఆడుకొనేవాడు.*

*★ మానవుడి మెడలో ఏడు వెన్నుపూసలు ఉంటాయి. విచిత్రం ఏమిటంటే... ఆరడుగుల పొడవైన జిరాఫీ మెడలో కూడా ఏడే వెన్నుపూసలుంటాయి.*

*★ చలిపెడుతున్నప్పుడు బిగువైన దుస్తులు ధరించేకన్నా... వదులైన దుస్తులు ధరిస్తేనే... ఎక్కువ రక్షణ.*

*★ భూమి బరువు ప్రతి రోజూ 10 టన్నుల చొప్పున పెరుగుతుందన్న నిజం మీరెరుగుదురా? వాతావరణ మార్పులు, ఇతర గ్రహాలనుంచీ వచ్చిపడే దుమ్ముధూళి కారణగానే ఈ పెరుగుదల సంభవిస్తుందట.*

*★ తేనెటీగ మనిషిని కుట్టాలంటే... ఒక్కసారిగా తన శరీరంలోని 22 కండరాలను కదిలించవలసి ఉంటుంది.*

*★ 1931లో చైనాలోని 'హువాంగ్‌హో' నదికి వచ్చిన వరద వలన జరిగిన ప్రళయం.. ప్రపంచవ్యాప్తంగా అతి బీభత్సమైంది. అత్యంత భయానకమైనది. ఈ వరద కారణంగా మృతి చెందిన వారి సంఖ్య అక్షరాలా 37 లక్షలు.. ఆస్థి నష్టం అంటారా... అంచనాయే లేదు.*



*★ మానవుని మెదడులో ఉండే హైపోథేలమస్ బరువు పావు అవున్స్ మాత్రమే. అయితే మన శరీరంలో కలిగే ఆకలి, దాహం, రక్తపోటు, భయం, నిద్ర, శరీర ఉష్ణోగ్రత వీటన్నింటినీ ఇదే కంట్రోల్ చేస్తుంది.*

**-పద్మశ్రీ**